# బహుముఖ ప్రజ్ఞాశాలి.. పి.సి.రే!



**దేశంలో ఏ వ్యాధి నివారణకు మందులు కావాలన్నా విదేశాలపై ఆధారపడే రోజులు.. అలాంటి స్థితి నుంచి మందుల తయారీ రంగంలో స్వయం సమృద్ధిని సాధించాలనే తపనతో 'ది బెంగాల్ కెమికల్ అండ్ ఫార్మాస్యూటికల్ వర్క్స్'ను స్థాపించి.. ఔషధాల రంగంలో మనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించిన స్వాప్నికుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రఖ్యాత రసాయన శాస్త్రవేత్త ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే (పి.సి.రే)..!**

స్థలం : బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం
కాలం : 1920వ సంవత్సరం

విశ్వవిద్యాలయంలో ఆ రోజు పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు కెమిస్ట్రీలో ప్రాక్టికల్ పరీక్షలు జరగాల్సి ఉంది. అక్కడి అధ్యాపకులు, విద్యార్థులు కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ఎగ్జామినర్‌గా రావలసిన ప్రొఫెసర్ కోసం నిరీక్షిస్తున్నారు. ఇంతలో అక్కడకు తెల్లబడిన చింపిరి జుట్టు, పెరిగిన గడ్డం, ఇస్త్రీ చేయని ముడతలు పడిన పంచె, లాల్చీతో చేతిలో ఏదో ఫైల్, ఒక పుస్తకం పట్టుకున్న వ్యక్తి అక్కడకు వచ్చారు. ఆయన ఏ విద్యార్థి బంధువో అనుకొని అక్కడివారు కొంచెం దూరంగా వేచి ఉండమని చెప్పారు. పరీక్ష టైం అయింది. ఎగ్జామినర్ ఇంకా రాలేదు. అసలే ఆందోళనగా ఉన్న ఓ అధ్యాపకుడు... ఆ వేచి ఉన్న వ్యక్తిని 'మీకేం కావాలి?' అని విసుగ్గా అడిగాడు. దానికి ఆయన 'నేను కెమిస్ట్రీ ప్రాక్టికల్ పరీక్ష జరపడానికి కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి వచ్చాను' అని వినయంగా చెప్పారు. ఏ మాత్రం, భేషజం లేని ఆ వ్యక్తిని చూసి అవాక్కయిన అక్కడి అధ్యాపకులు.. ఆయనకు క్షమాపణలు చెప్పుకుని లాబొరేటరీలోకి ఆహ్వానించారు. ఆ మహోన్నత వ్యక్తే ప్రఖ్యాత రసాయన శాస్త్రజ్ఞుడు ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే (పి.సి.రే)

## బహుముఖ ప్రజ్ఞ :

డాక్టర్ పి.సి.రే గొప్ప రసాయన శాస్త్రజ్ఞుడే కాదు, సుప్రసిద్ధ ఫార్మకాలజిస్టు. పారిశ్రామిక వ్యవస్థాపకుడు. గొప్ప దేశభక్తుడు. ఇంగ్లీషు, బెంగాలీ సాహిత్యంలోనే కాకుండా సంస్కృతం, గ్రీకు, లాటిన్ భాషల్లో కూడా అపారమైన పాండిత్యం ఆయన సొంతం. పి.సి.రే మంచి వక్త, ఆదర్శప్రాయుడైన ఉపాధ్యాయుడు. ప్రఖ్యాత భారతీయ శాస్త్రజ్ఞులు మేఘనాధ్ సాహా, సత్యేంద్రనాథ్ బోస్, శాంతిస్వరూప్ భట్నాగర్ ఆయన శిష్యులే.

## విద్యార్థి దశ:

రే జన్మస్థలం ప్రస్తుత బంగ్లాదేశ్‌లో కుల్నా జిల్లాలోని కాలిపరా గ్రామం. చదువుకునే రోజుల్లో.. ప్రఖ్యాత శాస్త్రవేత్త బెంజిమన్ ఫ్రాంక్లిన్ ఆత్మకథతో స్ఫూర్తి పొంది, శాస్త్ర అధ్యయనంలో ఆసక్తిని పెంచుకున్నారు పి.సి.రే. దీనికితోడు కెమిస్ట్రీ అధ్యాపకుడు అలెగ్జాండర్ షెడ్లర్ ఉపన్యాసాలు ఆయన్ను బాగా ప్రభావితం

SAKSHI

చేశాయి. ఆ ప్రభావంతోనే రసాయన శాస్త్రంలోనే ఉన్నత విద్యను అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. దాని ఫలితమే ఆయన లండన్ యూనివర్శిటీ నిర్వహించే పోటీ పరీక్షలో నెగ్గి 'గిల్‌క్రిస్ట్ ప్రైజ్ స్కాలర్‌షిప్'తో చదువు కొనసాగించడం. 1882లో ఇంగ్లండ్‌కు వెళ్లిన ప్రఫుల్ల చంద్ర.. లండన్‌లోని ఎడింబరో యూనివర్సిటీ నుంచి 1885లో బి.ఎస్.సి. డిగ్రీని సంపాదించారు. కెమిస్ట్రీలో జరిపిన పరిశోధనలకుగాను అదే యూనివర్సిటీ నుంచి 27 ఏళ్ల వయసులోనే ఆయన 'డాక్టర్ ఆఫ్ సైన్స్' (డీఎస్‌సీ) డిగ్రీని పొందారు.

## కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా :

1888 స్వదేశానికి తిరిగి వచ్చిన ప్రఫుల్ల చంద్ర.. 1916 వరకు కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, తర్వాత 1936 వరకు పాలిట్ ప్రొఫెసర్‌గా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో పదవులను నిర్వహించారు. ఆయన ఉపన్యాసాలు సునిశిత హాస్యంతో కూడుకొని విద్యార్థులను ఉత్తేజపరుస్తుండేవి. రవీంద్రనాథ్ టాగూర్ గేయాలు.. ప్రాచీన భారతీయ రసాయన శాస్త్రజ్ఞుడు ఆచార్య నాగార్జునుడు రాసిన 'రసరత్నాకరం' అనే గ్రంథంలోని శ్లోకాలు ఆయన ఉపన్యాసాల్లో తొంగి చూస్తుండేవి. ఆ రోజుల్లోనే ఆయన మెర్క్యురస్ నైట్రేట్‌పై ప్రచురించిన పరిశోధనా పత్రం.. బంగారం, ప్లాటినం, ఇరిడియమ్ సమ్మేళనాలపై చేసిన పరిశోధనలు దేశవిదేశాల్లో ఎనలేని ప్రాచుర్యాన్ని పొందాయి. 1920 నాటికి ఆయన రసాయనశాస్త్ర విభాగాలన్నిటిలో 107 పరిశోధనా పత్రాలు వెలువరించారు. తనకు 60 ఏళ్లు నిండిన సందర్భంలో.. తన వేతనమంతా కలకత్తా విశ్వవిద్యాలయ రసాయనశాస్త్ర విభాగ అభివృద్ధికి, పరిశోధనలకు విరాళంగా ఇవ్వడం ఆ శాస్త్రంపై ఆయనకున్న మక్కువకు నిదర్శనం. 1936లో పదవీ విరమణ చేసిన పి.సి.రే... తన శేష జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకే అంకితం చేశారు.

## సంఘసేవలో:

బెంగాల్ రాష్ట్రంలో వరదలు వచ్చినపుడు పి.సి.రే. చేసిన సేవలు ఎనలేనివి. అపుడే దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చిన మహాత్మాగాంధీతో కలిసి రే వరద బాధితుల సహాయ నిధికి 25 లక్షల రూపాయలు సేకరించారు. రే సేవలను ప్రశంసిస్తూ ఆయన్ను 'డాక్టర్ ఆఫ్ ఫ్లడ్స్' అని ప్రశంసించారు గాంధీజీ.

## జీవన విధానం:

జీవితకాలం ఖద్దరు దుస్తులనే ధరించి, బ్రహ్మచర్యం పాటించిన ప్రఫుల్ల చంద్ర... యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లోని ఒక చిన్న గదిలో నివసించేవారు. ఆ గదిలో ఆయన వస్తు సామగ్రి ఒక ఇనుప మంచం, ఒక చిన్న టేబుల్, కుర్చీ, పెద్ద బీరువా నిండా విజ్ఞానాన్ని వెదజల్లే అనేక గ్రంథాలు. అతి సామాన్య నిరాడంబర జీవనం- అద్భుతమేధ అనే నానుడికి ప్రతీక ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే!!